సాక్షి అనకాపల్లి

సోమవారం । 5 । మే । 2025



ఇంకెన్నాళ్లీ నిరీక్షణ? 8లో

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు.. భవనాలు నిర్మించేందుకు మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది.

ఉష్ణోగ్రతలు

ఆదివారం

		గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	:	30.3/22.5
చోడవరం	:	34.0/24.0



మార్మోగిన హరినామస్మరణ

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామ సంకీర్తనలతో సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరం ఆదివారం మార్మోగింది.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా అమర్‌నాథ్ ప్రమాణ స్వీకారం



అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా గుడివాడ అమర్‌నాథ్ ప్రమాణస్వీకారం చేయనున్నారని, అనంతరం పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారని ఆపార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, వైఎస్సార్‌సీపీ అడ్వైజర్ కమిటీ మెంబర్, మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభ హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొంనున్నట్టు తెలిపారు. జిల్లాలో వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వారు కోరారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో వంటలు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, సహపంక్తి భోజనం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఉచితంగా తాగునీరు, మజ్జిగ, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను(గొల్లబాబు) ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాలింతలకు, చిన్నారులకు ఉచితంగా పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు మజ్జి శ్రీనివాసరావు, కాండ్రేగుల రాజారావు, మారిశెట్టి శంకరరావు, పోలిమేర ఆనంద్, దాడి రవికుమార్, సూరే సతీష్, ఎర్రవరపు లక్ష్మి, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

కరెంట్ టాపిక్

2 ఎకరాలు... వేలే!



PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR, ANAKAPALLI
PRESENT: SMT. VIJAYA KRISHNAN, I.A.S.,

కలెక్టర్ ఉత్తర్వులు

జిల్లా టీడీపీ కార్యాలయానికి తక్కువ రేటుకు రెండు ఎకరాల స్థలాన్ని లీజుకు ఇచ్చిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. రూ.కోట్ల విలువైన భూమిని ఎలాంటి నిబంధనలు పాటించకుండా అధికార పార్టీకి కేటాయించేశారు. ఏడాదికి రూ.20 లక్షల అద్దె వసూలు చేయవలసి ఉండగా కేవలం రూ.2 వేలకే రెండు ఎకరాల స్థలాన్ని లీజుకు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

టీడీపీ కార్యాలయానికి చాలా తక్కువ అద్దెకు రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు

- 33 ఏళ్ల పాటు లీజుకు చకచకా కదిలిన ఫైల్
- తుమ్మపాల సర్వే నంబర్ 608/10లో స్థలం అప్పగింత
- ఏడాదికి ఎకరానికి రూ.1,000 చొప్పున లీజు ఫీజు
- గత నెల 28న దొడ్డిదారిన ఉత్తర్వులు జారీ
- వివాదాస్పదమవుతుందని మంత్రివర్గ ఆమోదం లేకుండానే స్కెచ్
- కలెక్టర్ విజయకృష్ణన్ తీరుపై విమర్శల వెల్లువ



టీడీపీ కార్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ భూముల కేటాయింపు విధానం–2012 ప్రకారం ప్రైవేట్ సంస్థలు, రాజకీయ పార్టీలకు ప్రభుత్వ భూములు కేటాయించడం చట్ట విరుద్ధం. ఒక వేళ అసాధారణ పరిస్థితుల్లో.. ప్రజా ప్రయోజనాల రీత్యా ఇస్తే ప్రభుత్వ ధరలో 10 శాతం కంటే అద్దె తక్కువగా ఉండకూడదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా జిల్లా టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయించడం ఇప్పుడు వివాదాస్పదమైంది. తుమ్మపాలలో ప్రభుత్వ రేటు ఎకరా రూ.2 కోట్లు పైగా ఉంది.బయట మార్కెట్ విలువ రూ. పది కోట్లకు మించి ఉంది. ప్రభుత్వ రేటు ప్రకారమే రెండు ఎకరాలకు కనీసం ఏడాదికి రూ.20 లక్షలకు తగ్గకుండా అద్దె వసూలు చేయాల్సి ఉంది. కానీ కలెక్టర్ వాస్తవ ధరలను పరిగణనలోకి తీసుకోకుండా ఎకరా వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లపాటు లీజుకు కేటాయించారు. నగర, పంచాయతీ పరిధిలో పోరంబోకు భూమిని ప్రైవేట్ సంస్థలకు కేటాయింపును నిషేధిస్తూ 2012లో జగపాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఈ తీర్పు అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆదేశించింది. కానీ టీడీపీ కార్యాలయానికి ప్రభుత్వ భూమిని కేటాయించడం కోర్టు ఆదేశాలను ఉల్లఘించడమేనని విశ్రాంత ఐఏఎస్ అధికారులు సైతం చెబుతున్నారు. ప్రజల ఆస్తిని టీడీపీ కార్యాలయానికి కారుచౌకగా కట్టబెట్టిన కలెక్టర్ తీరును తప్పుబడుతున్నారు.

ఆగమేఘాలపై ఉత్తర్వులు..

ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు జూలై 22న చేసిన దరఖాస్తు మేరకు టీడీపీ కార్యాలయ భవనం కోసం రెండు ఎకరాలు కేటాయించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 40 రోజుల్లోనే కేటాయింపు చేశారు. 2025 జనవరి 8న స్థల పరిశీలన చేశారు. అయితే ఆగమేఘాలపై 2025 ఏప్రిల్ 24న ఒకేరోజు అనకాపల్లి తహసీల్దార్, అనకాపల్లి ఆర్డీవో తమ పని పూర్తిచేశారు. నాలుగు రోజుల వ్యవధిలో ఏప్రిల్ 28న తుమ్మపాల సర్వే నంబర్ 608/10లో రెండెకరాల పోరంబోకు భూమిని, ఏడాదికి ఎకరాకు వెయ్యి రూపాయల లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుట్టుచప్పుడు కాకుండా..

అనకాపల్లి మండలంలో తుమ్మపాల సర్వే నంబర్ 608/10లో కోట్లాది రూపాయల విలువైన రెండు ఎకరాల పోరంబోకు భూమిని అత్యంత కారు చౌకగా ఏడాదికి రూ.2,000 చొప్పున అద్దె చెల్లించే ప్రాతిపదికన 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తూ గత నెల 28న గుట్టు చప్పుడు కాకుండా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులు, పార్టీలకు కేటాయించకూడదన్న నిబంధనలను పక్కన బెట్టి భూమిని అందజేశారు. మంత్రివర్గ ఆమోదానికి పెడితే వివాదాస్పదమవుతుందని అడ్డదారిలో టీడీపీ స్థలం పొందింది.

పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలి



ఆర్టీఐ సెక్షన్ (41)(సి)ప్రకారం ముఖ్యమైన విధానాలను రూపొందించినప్పుడు, ప్రజలపై ప్రభావం చూపించే నిర్ణయాలను ప్రకటించేటప్పుడు జిల్లా ఉన్నతాధికారులు వాస్తవాలను బహిర్గతం చేయాలి. పారదర్శకత, జవాబుదారీతనంతో నిర్ణయాలు తీసుకోవాలి. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి పేదలు కోరుతున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం ఆగమేఘాలపై అధికార రాజకీయ పార్టీకి అప్పనంగా కోట్లాది విలువైన భూమిని ధారాదత్తం చేయడం సిగ్గుచేటు.

–కాండ్రేగుల వెంకటరమణ, ఆర్టీఐ, వినియోగదారుల చట్టాల ఉద్యమకర్త

లీజు రద్దు చేయాలి



కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, జిల్లా కోర్టు, రిజిస్టర్ ఆఫీస్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ తదితర కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వాటిపై దృష్టి సారించకుండా అధికార పార్టీకి మాత్రం స్థలం కేటాయించడమేంటి?. టీడీపీ కార్యాలయానికి అత్యంత చౌకగా, చట్టవిరుద్ధంగా కలెక్టర్ స్థలం కేటాయించడం తగదు. ఈ లీజును వెంటనే రద్దు చేయాలి. పేద ప్రజలకు కనీసం రెండు సెంట్ల నివాస స్థలం ఇవ్వడానికి ముందుకురాని అధికారులు అధికార పార్టీకి ఏ విధంగా స్థలాన్ని కేటాయిస్తారు. నాన్ షెడ్యూల్ ఏరియాలో వందలాది ఎకరాలు గిరిజనుల భూములు కబ్జాలకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతూ కలెక్టర్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఆ సమస్యలపై అధికారులు దృష్టిసారించాలి.

–డి. వెంకన్న, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరరావు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వివిధ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తోందని, కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా బీజేపీ పాలన సాగుతోందని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న తదితర డిమాండ్లతో ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్టు చెప్పారు. మోడీ పాలనలో కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు హక్కులు కోల్పోతారని చెప్పారు. రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు, కూలీల జీవితాలు దుర్భరంగా మారాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు దుర్గారాణి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి, జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు, ఆర్.రాము, గనిశెట్టి సత్యనారాయణ, జి.దేవుడు నాయుడు, ప్రేమ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కారుచౌకగా స్థలం కేటాయింపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్

అనకాపల్లి: టీడీపీ కార్యాలయం ఏర్పాటుకు అతి తక్కువ అద్దెకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం తగదని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పిన అధికారులు, మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధి సర్వే నంబర్ 608/10లో జిల్లా టీడీపీ కార్యాలయం నిర్మాణానికి ఎలా స్థలాన్ని కేటాయించారని ప్రశ్నించారు. సుమారు రూ.20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఏడాదికి రూ.2వేల అద్దె చొప్పున లీజుకు ఇవ్వడం అన్యాయమన్నారు. ఈ లీజును వెంట రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కనీసం రెండు, మూడు సెంట్ల నివాస స్థలం ఇవ్వడానికి చేతులు రాని ప్రభుత్వం, అధికార పార్టీకి ఏ విధంగా స్థలాలను కేటాయిస్తుందని ప్రశ్నించారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఏంచేసిందని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు కాళ్ల తేలయ్యబాబు, కనకల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: భగీరథుడు దీక్షకు, సహనానికి ప్రతిరూపమని, ఎంత కష్టమైనా లెక్కచేయకుండా దివి నుంచి భువికి గంగను తీసుకువచ్చారని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహర్షి చిత్రపటానికి డీఆర్వో పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు జీవితంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి కె.రాజేశ్వరి మాట్లాడుతూ భగీరథుడి వారసులైన ఉప్పర కులానికి చెందిన వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి రుణాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, గవర్ కార్పొరేషన్ డైరెక్టర్ నూకరాజు, కలెక్టరేట్ ఇన్‌చార్జి ఏవో వాసునాయుడు, ఉప్పర, సగర కమ్యూనిటీ అధ్యక్షుడు నక్క పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాతాళానికి నీళ్లు

- క్షీణిస్తున్న భూగర్భ జలం
- జిల్లా తాజా నీటి మట్టం 6.68 మీటర్లు
- జనవరితో పోల్చితే ఏప్రిల్ నెలాఖరుకు 1.85 మీటర్ల తగ్గుదల
- ఎండల తీవ్రతకు వేగంగా పడిపోతున్న భూగర్భ జలమట్టం
- పలుచోట్ల మొరాయిస్తున్న బోర్లు.
- అడుగంటిన చెరువులు,రిజర్వాయర్లు
- గ్రామాలు,పట్టణాలు,మండల కేంద్రాల్లో మొదలైన నీటి కష్టాలు



కోటవురట్ల మండలం చౌడువాడలో భూగర్భ జలమట్టాన్ని కొలుస్తున్న అధికారులు



యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి సమీపంలో శేషుగెడ్డ రిజర్వాయర్‌లో అడుగంటిన జలం

యలమంచిలి రూరల్: జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో సగటున 4.83 మీటర్ల లోతులో నీటి మట్టం ఉండగా, ఏప్రిల్ నెలాఖరుకు జిల్లా సగటు నీటి మట్టం 6.68 మీటర్లుగా ఉంది. నాలుగు నెలల వ్యవధిలో 1.85 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు క్షీణించాయి. మే నెలాఖరుకు నమోదయ్యే గణాంకాల్లో భూగర్భ జలాలు మరింత పడిపోయే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాలకు కొంతమేర భూగర్భ జలాలు పెరగడంతో పరిస్థితి కొంతమెరుగ్గా ఉందని, లేనిపక్షంలో మరింత లోతుకు భూగర్భ జలాలు ఇంకిపోయేవన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ప్రస్తుతం జిల్లాలో పలు ప్రాంతాల్లో వ్యవసాయబోర్లు మొరాయిస్తున్నాయి. కొన్ని గ్రామాలు, మండల కేంద్రాలు,యలమంచిలి పట్టణం తదితర ప్రాంతాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. యలమంచిలి పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకొకసారి నీటి సరఫరా జరుగుతోంది. ముఖ్యంగా నిర్మాణాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు,పారిశ్రామిక ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం పాతాళానికి పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

నాలుగు మండలాల్లో దిగువకు జలం

భూగర్భ జలాల స్థితిగతులు తెలుసుకునే నిమిత్తం 24 మండలాల పరిధిలో 81 ఫీజోమీటర్లు ఏర్పాటు చేశారు.భూగర్భ జలశాఖ అధికారులు ప్రతి నెలా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలను నమోదు చేస్తారు. ఏప్రిల్ నెలాఖరుకు సేకరించిన గణాంకాల ప్రకారం జిల్లా సగటు నీటి మట్టం 6.68 మీటర్లుగా నమోదైంది.జిల్లాలో దేవరాపల్లిలో గరిష్ఠంగా 22.55 మీటర్లకు నీటి మట్టం పడిపోయింది.అచ్యుతాపురంలో గరిష్ఠంగా 21.92 మీటర్లు, బుచ్చెయ్యపేటలో 20.21 మీటర్లు,వి.మాడుగులలో 18.78 మీటర్ల లోతుకు నీరు చేరింది. దేవరాపల్లి మండలం తామరబ్బ గ్రామంలో గరిష్ఠంగా 22.55 మీటర్ల లోతుకు జలాలు అడుగంటాయి. అందుబాటులో ఉన్న దానికంటే అధికంగా నీటిని వినియోగిస్తుండడం వల్ల జిల్లాలో పలు ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. ఎస్.రాయవరం మండలం ఆర్.కొత్తూరులో 0.79 మీటర్లలోనే జలసిరి అందుబాటులో ఉండడం ఆశాజనకం.గత మార్చిలో 3 మీటర్ల లోతు నుంచి 8 మీటర్ల లోతులో 19 మండలాల్లో జలం అందుబాటులో ఉండగా, నర్సీపట్నంలో కేవలం 1.61 మీటర్ల లోతులోనే జలాలు ఉన్నాయి.నీరు 20 మీటర్ల లోతులోకి వెళ్తే ఆ ప్రాంతంలో సమస్య ఏర్పడినట్టు అధికారులు భావిస్తారు.

వివిధ మండలాల్లో తాజాగా నమోదైన భూగర్భ జలమట్టం (మీటర్లలో)

మండలం	నీటిమట్టం				
అనకాపల్లి	8.89	దేవరాపల్లి	22.55	నాతవరం	7.41
అచ్యుతాపురం	21.92	గొలుగొండ	15.68	పరవాడ	11.66
యలమంచిలి	6.93	కె.కోటపాడు	8.29	పాయకరావుపేట	11.54
బుచ్చెయ్యపేట	20.21	కశింకోట	5.57	రాంబిల్లి	12.26
మాకవరపాలెం	3.79	కోటవురట్ల	3.99	రావికమతం	8.91
చీడికాడ	5.43	మునగపాక	4.55	రోలుగుంట	8.77
చోడవరం	12.47	నక్కపల్లి	8.93	సబ్బవరం	7.14
		నర్సీపట్నం	1.61	వి మాడుగుల	18.78

వృథాను అరికట్టాలి



రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు నీటి పొదుపును బాధ్యతగా భావించాలి. ఆటోమెటిక్ స్టార్టర్లతో పొలాల్లో బోర్ల ద్వారా నిరంతరాయంగా నీటిని తోడేయకుండా చూడాలి.పంటకు నీరు సరిపోయాక ఆపేయాలి.భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలి. నీటి వృథాను అరికట్టాలి.

–జి.శ్రీనివాసరావు, ఉపసంచాలకులు, భూగర్భ జలవనరుల శాఖ

ఆ.. 2,865 టికెట్లు ఎవరికిచ్చారు?



- చందనోత్సవం టికెట్ల లెక్కల్లో భారీ తేడా
- అధికారిక లెక్కలకు, వాస్తవానికి వ్యత్యాసం
- అంతరాలయ దర్శనంపైనా విమర్శలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవం టికెట్ల విక్రయాలు, దర్శనాల నిర్వహణకు సంబంధించి దేవస్థానం విడుదల చేసిన జాబితాలో పలు వ్యత్యాసాలు, అస్పష్టతలు ఉన్నాయి. ముఖ్యంగా టికెట్ల సంఖ్య, తెల్లవారుజామున కల్పించిన అంతరాలయ దర్శనాల విషయంలో అధికారుల లెక్కలపై భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో కె. సుబ్బారావు పేరిట ఆదివారం విడుదలైన జాబితా ప్రకారం.. ఈ ఏడాది చందనోత్సవం సందర్భంగా రూ. 300 టికెట్లు ఆఫ్‌లైన్‌లో 15,495, ఆన్‌లైన్‌లో 7,591 కలిపి మొత్తం 23,086 విక్రయించారు. అలాగే రూ.1000 టికెట్లు ఆఫ్‌లైన్‌లో 13,803, ఆన్‌లైన్‌లో 3,999 కలిపి మొత్తం 17,802 జారీ చేశారు. రూ.1500 టికెట్లు కేవలం ఆఫ్‌లైన్‌లో 3,000 విక్రయించినట్లు పేర్కొన్నారు. వీటికి అదనంగా 496 అంతరాలయ టికెట్లుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం మొత్తంగా 44,384 టికెట్లు విక్రయించినట్లు జాబితాలో ఉంది. అయితే గత నెల 24 నుంచి 29 వరకు రోజువారీగా టికెట్ల విక్రయాల జాబితాను పరిశీలిస్తే.. మొత్తం 41,519 టికెట్లు మాత్రమే అమ్ముడైనట్లు పేర్కొన్నారు. దీంతో దేవస్థానం విడుదల చేసిన మొత్తం లెక్కకు, రోజువారీ లెక్కలకు మధ్య 2,865 టికెట్ల వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. కాగా.. తెల్లవారుజామున అంతరాలయ దర్శనం కేవలం 496 మందికి మాత్రమే కల్పించినట్లు అధికారులు చూపించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చందనోత్సవం రోజు ఉదయం చాలా మందిని అంతరాలయ దర్శనానికి అనుమతించినట్లు భక్తులు, స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. వారి అంచనా ప్రకారం అంతరాలయ దర్శనం పొందిన వారి సంఖ్య వెయ్యికి పైగానే ఉంటుందని అంటున్నారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, టీటీడీ నుంచి పట్టు వస్త్రాలు సమర్పించేవారు, మంత్రులు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు మాత్రమే ఉచితంగా అంతరాలయ దర్శనం కల్పిస్తామని దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ప్రకటించారు. తీరా ఈవో ప్రకటనకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతనే లేకుండా పోయింది. గత ఏడాదితో పోలిస్తే టికెట్ల విక్రయాలు పెరిగినట్లు దేవస్థానం పేర్కొంది. 2024లో మొత్తం 32,461 టికెట్లు విక్రయించగా, ఈ సంవత్సరం 44,384 టికెట్లు అమ్ముడైనట్లు తెలిపింది. రూ.300, రూ.1000 టికెట్లలో గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా 12,889 టికెట్లు విక్రయించామని పేర్కొంది. గత ఏడాది ఆన్‌లైన్‌లో రూ.300, రూ.1000 టికెట్లు కలిపి 8,216 విక్రయించగా, ఈ ఏడాది 11,590 అమ్ముడైనట్లు నివేదించారు. అంటే ఆన్‌లైన్‌లో 3,374 టికెట్లు అదనంగా విక్రయించామని చెబుతున్నారు. అయితే రూ.1000 టికెట్లు తొలిరోజు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, మిగతా ఏ రోజుల్లోనూ ఆ టికెట్లు లభించలేదని భక్తులు వాపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పారదర్శకత కొరవడిందని విమర్శిస్తున్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

- జనవరిలో దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన
- ఇంతవరకూ భూమి చదునుకు మాత్రమే పరిమితమైన పనులు
- భవన నిర్మాణాలకు మరో రెండేళ్లు పట్టే అవకాశం
- తాత్కాలిక కార్యకలాపాలకు భవనాలున్నా స్పందించని రైల్వే శాఖ
- ఇప్పట్లో జోన్ కార్యకలాపాలు ఉండవంటున్న వాల్తేరు అధికారులు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగి నాలుగు నెలలు.. టెండర్లు ఖరారు చేసి ఐదు నెలలు పూర్తయినా.. ఇంకా భూమి చదును చేసే పనులకే పరిమితమైంది. భవనాలు నిర్మించేందుకు మరో రెండేళ్ల సమయం పట్టేలా కనిపిస్తోంది. తాత్కాలిక కార్యకలాపాలకు భవనాలు సిద్ధంగా ఉన్నా రైల్వే శాఖ మాత్రం ముందుకు రావడం లేదు. గతంలోనే ఇక్కడ ఉన్న భవనాల జాబితాను వాల్తేరు అధికారులు పంపించినా.. స్పందించకపోవడం చూస్తుంటే మరో రెండేళ్ల పాటు జోన్ కార్యకలాపాలు మొదలవ్వవేమోనన్న అనుమానాలు బలపడుతున్నాయి. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివర్లో ఇచ్చేసినా రాజకీయ కక్షతో ముందడుగు వేయలేదు. 2024 ఎన్నికల అనంతరం నవంబర్‌లో టెండర్లు ఆహ్వానించారు. జనవరిలో ప్రధాని చేతుల మీదుగా జోన్ భవనాలకు శంకుస్థాపన చేశారు. అయినా ముడసర్లోవలో భూమి చదును చేసే పనుల్లోనే ఇంకా రైల్వే శాఖ నడిపిస్తోంది. ఈ భూములను తాము సాగుచేసుకుంటున్నామని స్థానికులు ఆందోళన చేయగా.. కూటమి నేతలు రంగంలోకి దిగి జోన్ భవనం వచ్చిన తర్వాత.. అందులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మాయమాటలు చెప్పి వారిని శాంతింపజేశారు. అయినా.. ఇంకా చదును పనులే సా..గుతున్నాయి.

రాజకీయాలకు రైల్వే జోన్ బలి!



జోన్ భవనం రానున్నది ఇక్కడే

కూటమి నేతల నిర్లక్ష్యం, ఒడిశా రాజకీయాలకు ఉత్తరాంధ్రుల చిరకాల స్వప్నమైన రైల్వే జోన్ పనులు ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. కనీసం తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాలంటూ కూటమి ఎంపీలు గానీ, రాష్ట్ర ప్రభుత్వం గానీ రైల్వే మంత్రికి, బోర్డును కానీ కోరడం లేదు. శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడిచినా దీనిపై ఏ ఒక్క కూటమి ఎంపీ నోరు మెదపకపోవడం జోన్ పాలిట శాపంగా మారింది. దీన్ని ఆసరాగా తీసుకొని ఒడిశా పావులు కదుపుతోంది. అత్యధిక ఆదాయం వచ్చే వాల్తేరు డివిజన్‌ను వదులుకోవడం ఇష్టం లేని ఒడిశాలోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు తెర వెనుక రాజకీయాలు నడుపుతున్నారు. అక్కడ రాజకీయ నేతలు కూడా వీరికి సహకరించడంతో.. రైల్వే బోర్డు ఒడిశా ఏం చెబితే అదే చేస్తోంది. ఫలితంగా విశాఖ జోన్ బలవుతూ వస్తోంది.

జీఎం నియామకం ఎప్పుడో..?

రైల్వే జోన్ కార్యకలాపాలను ప్రారంభించడానికి రైల్వేశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. రెండేళ్లలో జోనల్ కార్యాలయ నిర్మాణం పూర్తి చేసి, ఆ తరువాత ఆపరేషన్లు ప్రారంభిస్తామని సాకులు చెబుతోంది. ఇప్పటివరకు ప్రకటించిన రైల్వే జోన్లలో ఎక్కడా.. ఈ తరహా పరిస్థితులు కనిపించలేదు. జోన్ ప్రకటించిన తరువాత కార్యకలాపాల్ని తాత్కాలిక భవనాల్లో ప్రారంభించి.. కొత్త భవనాల నిర్మాణం అనంతరం అక్కడికి మార్చేవారు. కానీ విశాఖ జోన్ విషయంలో మాత్రం ఆది నుంచీ పూర్తి విరుద్ధంగా సాగుతోంది. కొత్త భవన నిర్మాణాలు చేపట్టిన తర్వాతే ఆపరేషన్లు ప్రారంభిస్తామంటూ రైల్వేశాఖ చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే నుంచి విడదీసిన గుంటూరు, గుంతకల్, విజయవాడ డివిజన్లను, విశాఖ కేంద్రంగా ఉన్న వాల్తేరు డివిజన్‌ను కలిపి 'దక్షిణ కోస్తా' జోన్‌గా ప్రకటించారు. దాదాపు ఏపీ మొత్తం ఈ జోన్‌లోనే ఉండటంతో రాష్ట్రమంతటికీ సేవలందనున్నాయి. కొత్త రైళ్లు కావాలన్నా, రైల్వే లైన్లు కావాలన్నా జోనల్ అధికారులే ప్రతిపాదనలు పెట్టాలి. ఇది జరగాలంటే జోన్‌కు తొలుత జనరల్ మేనేజర్(జీఎం) నియామకం చేపట్టాలి. ఈ విషయంలోనూ బోర్డు స్పందించడం లేదు.

తాత్కాలికానికి భవనాలు సిద్ధంగా ఉన్నా..!

బిల్డింగ్ నిర్మాణంతో పనిలేకుండా జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. తాత్కాలిక కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న వాల్తేరు డీఆర్ఎం కార్యాలయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ విషయాన్ని ఇప్పటికే సౌత్ కోస్ట్ జోన్ ఓఎస్‌డీ.. తాను సమర్పించిన జోన్ డీపీఆర్‌లోనూ పొందుపరిచారు. రైల్వేస్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా స్టేషన్ బయట 'గతిశక్తి' పథకంలో భాగంగా 4 అంతస్తుల భవనాలు రెండు నిర్మించారు. ఒక్కో అంతస్తులో 4,500 చదనపు అడుగుల స్థలం అందుబాటులో ఉంది. కింద గ్రౌండ్ ఫ్లోర్‌తో కూడా కలుపుకొంటే దాదాపు 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన కొత్త భవనాలు ఉన్నాయి. తాత్కాలిక కార్యకలాపాలు చేపట్టేందుకు గెజిట్ విడుదల చేయాల్సి ఉన్నా బోర్డు నుంచి ఎలాంటి సూచనలు కనిపించడం లేదని వాల్తేరు అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితమే తాత్కాలిక భవనాల జాబితా పంపించామని, ఇప్పటికీ అతీగతి లేకపోవడం చూస్తే ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు. కూటమి ఎంపీలు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విశాఖవాసులు కోరుతున్నారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఉమ్మలాడలో విషాదం



మృతుడు కరోతి గణేష్

మునగపాక: స్నేహితులతో కలిసి తిరుపతి వెంకన్న స్వామిని దర్శించుకుని తిరిగి వస్తుండగా తాడేపల్లిగూడెం వద్ద రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి ఉమ్మలాడ వాసి ఒకరు మృతి చెందిన సంఘటన అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉమ్మలాడకు చెందిన కరోతి గణేష్(34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితులతో కలిసి రెండు రోజుల క్రితం తిరుపతి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో ట్రైన్‌లో వస్తుండగా తాడేపల్లి గూడెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి కిందికి దిగే ప్రయత్నంలో జారి కింద పడిపోవడంతో మృతిచెందారు. మృతుడు గణేష్‌కు భార్య, ఏడాది వయసున్న పాప ఉన్నారు. అందరితో సరదాగా ఉండే గణేష్ రైలు ప్రమాదంలో మృతిచెందారన్న విషయం తెలియడంతో ఉమ్మలాడలో విషాదం అలముకుంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న గణేష్ రైలు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

జగనన్న వీరాభిమానిగా..

గణేష్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వీరాభిమాని. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఎంతో శ్రమించే గణేష్ రైలు ప్రమాదంలో మృతి చెందడాన్ని స్థానిక పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీ బలోపేతంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లిన గణేష్ అకాల మృతితో వారంతా విషాదంలో మునిగిపోయారు. గణేష్ కుటుంబానికి చెందిన కొందరు పార్టీని వీడి ఇతర పార్టీల్లోకి వెళ్లిపోయినా జగనన్నపై ఉన్న అభిమానంతో గణేష్ మాత్రం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగారని గుర్తు చేసుకుంటున్నారు.

భూసారం పెరిగేలా ప్రకృతి సాగు

నవధాన్యాల కిట్లు పంపిణీకి సిద్ధం



సిద్ధంగా ఉన్న ప్రకృతి వ్యవసాయ కషాయాలు, ద్రవ్యాలు



లాలంకొత్తూరు ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం వద్ద నవ ధాన్యాలతో రూపొందించిన ముగ్గు



సంచుల్లో సిద్ధం చేసిన నవ ధాన్యాల కిట్లు

కశింకోట: మండలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండిస్తున్న భూములు సారవంతం కావడానికి తొలకరి వర్షాల్లో వేసే నవ ధాన్యాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరు వద్ద మండల ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో సిబ్బంది సంచుల్లో నింపి రైతులకు సరఫరా చేయడానికి సిద్ధం చేశారు. కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ ఆధ్వర్యంలో ఏజెన్సీ, ఇతర ప్రాంతాల నుంచి నవ ధాన్యాలైన బొబ్బర్లు, సజ్జలు, రాగులు, ఉలవలు, కూరగాయలు, ఆకు కూరలు, పచ్చి రొట్ట విత్తనాలు, తదితర 30 రకాల విత్తనాలను సేకరించారు. ఎకరాకు 12 కిలోలు సరిపోయే విత్తనాలను కలిపి బ్యాగ్‌ల్లో నింపారు.

2వేల ఎకరాల్లో..

మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేస్తున్నారు. ఆయా భూముల్లో జల్లడానికి వీటిని రూ.1200కు సరఫరా చేస్తున్నారు. అలాగే తెగుళ్ల, క్రిముల నివారణకు వినియోగించే ప్రకృతి సిద్ధ ద్రవ్యాలు, కషాయాలు, క్రిమి సంహారక మందులను కూడా సరఫరాకు సిద్ధంగా ఉంచారు.ఈ సందర్భంగా అన్ని రకాల విత్తనాలతో అందంగా రూపొందించిన ముగ్గు అందరికి అలరించింది. నవ ధాన్యాలు నాటడానికి ఇదే అదును కావడంతో రైతులు వచ్చి విత్తనాల కిట్లను, ద్రవ్యాలను తీసుకెళుతున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి తరలిరావాలి



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అనకాపల్లిలో సోమవారం జరిగే వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని మాజీ డిప్యూటీ సీఎం, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల సలహా సంఘం సభ్యుడు బూడి ముత్యాలనాయుడు ఆదివారం పిలుపునిచ్చారు. అనకాపల్లి రింగ్‌రోడ్డులోని బెల్లం మార్కెట్ ఎదురుగా ఉన్న పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం పది గంటల ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యే ఈ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

బాధిత రైతుకు రూ.5 వేల సాయం



బాధిత రైతుకు నగదు అందిస్తున్న దృశ్యం

చీడికాడ: రైతుల పక్షపాతి మాజీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అని మండల వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి అన్నారు. పిడుగుపడి గేదె, పెయ్యిని కోల్పోయి నష్టపోయిన మండలంలోని చినగోగాడకు చెందిన రైతు కోనేటి సత్తిబాబుకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5వేల నగదును తమ వంతు సహకారంగా అందించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ సీఎంగా ఉన్న రోజుల్లో రాష్ట్రంలో రైతు రాజుగా మెలిగాడని, నేడు అప్పులపాలై దిక్కుతోచని స్థితిలో పాడ్డాడన్నారు. వారి వెంట వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, నేతలు పుట్టా రామ్‌కుమార్, కొల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి కొల్లి నారాయణమూర్తి, ప్రగడసాయి, కోన సత్తిబాబు, రామారావు తదితరులున్నారు.

కోనాం భోగొండమ్మను దర్శించుకున్న ధర్మశ్రీ, రేగం



భోగొండమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

చీడికాడ: మండలంలోని కోనాం భోగొండమ్మను అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. భోగొండమ్మ పండగ మహోత్సవంలో భాగంగా ఆయన కోనాంలో గల బంధువుల ఇంటికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే అనకాపల్లి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మిలతో పాటు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సలుగు సత్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు వేసవి ఉచిత క్రీడా శిక్షణ

- శిబిరానికి విశేష స్పందన
- ఆరోగ్యం, ఆత్మరక్షణ కల్పించే యోగా, తైక్వాండోపై శిక్షణ
- జిల్లాలో తైక్వాండో క్రీడకు ఐదు ప్రాంతాల్లో కేంద్రాలు
- యోగాకు చోడవరంలో శిక్షణ కేంద్రం



చోడవరం పతంజలి యోగా కేంద్రంలో ప్రారంభమైన వేసవి శిక్షణా కేంద్రం



చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభమైన తైక్వాండో వేసవి శిక్షణ కేంద్రం

చోడవరం: విద్యార్థులకు వేసవి సెలవులు రావడంతో వివిధ క్రీడలకు సంబంధించి ప్రారంభమైన వేసవి శిక్షణ కేంద్రాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించేందుకు ఆయా విభాగాల స్పోర్ట్స్ యూనిట్లు ఇప్పటికే అన్ని కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించాయి. ఆత్మరక్షణ, ఆరోగ్య రక్షణలకు కీలకంగా మారిన తైక్వాండో, యోగా క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలు ఎంతో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. 30 రోజుల పాటు ఈ కేంద్రాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తైక్వాండో అసోసియేషన్, చోడవరం పతంజలి యోగా కేంద్రాల ఆధ్వర్యంలో ఈ శిబిరాలు ప్రారంభమయ్యాయి.

తైక్వాండోపై వేసవి శిక్షణ

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ చాలా అవసరంగా మారింది. అందులో బాలికలకు ఆత్మరక్షణ ఎంతైనా అవసరం అని భావించి స్పోర్ట్స్ అథారిటీ ఈ వేసవి శిక్షణ తరగతుల్లో తైక్వాండో క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చింది. బాల, బాలికలు కలిసి 30రోజుల పాటు శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ జిల్లాలో ఐదు కేంద్రాల్లో తైక్వాండో జూడో ఆత్మరక్షణ క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు పట్టినట్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి తెలిపారు. చోడవరం, అనకాపల్లి పట్టణం, అనకాపల్లి గాంధీనగరం, పరవాడ, బుచ్చెయ్యపేట(వడ్డాది) ప్రాంతాల్లో వేసవి ఉచిత శిక్షణ కేంద్రాలు ప్రారంభించారు. 5 నుంచి 16 సంవత్సరాలు వయస్సు కలిగిన బాలబాలికలు ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 1 నుంచి నెలాఖరు వరకూ ఇచ్చే శిక్షణ తరగుతులకు విద్యార్థులు ఎంతో ఆసక్తితో శిక్షణ పొందుతున్నారని మురళి తెలిపారు.

చోడవరంలో యోగాపై వేసవి శిక్షణ

అందరికీ ఆరోగ్యాన్ని అందించే యోగాపై శిక్షణ ఇచ్చేందుకు ఈ వేసవిలో విద్యార్థులకు యోగాపై ఉచిత శిక్షణ కేంద్రాన్ని చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇక్కడి ఉషోదయ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న యోగా కేంద్రంలో ఉచితంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని యోగా గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. యోగా వల్ల విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం, శరీర సౌష్టవంతోపాటు ఏకాగ్రత లభిస్తుందన్నారు. చోడవరం ఉషోదయ కాలేజీలో ఈ వేసవి ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

గోస్తనీ గొంతెండుతోంది

- ఇసుకాసురుల దాటికి బలైన నది
- తాత్కాలిక పరిష్కారాలతో ప్రజాధనం వృథా
- చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతోనే మేలు

విశాఖపట్నం, విజయనగరం జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాలకు జీవనాధారమైన గోస్తనీ నది నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జీవీఎంసీతో పాటు భీమిలి, పద్మనాభం, ఆనందపురం మండలాలు, విజయనగరం జిల్లాలోని పలు పంచాయతీల తాగునీటి అవసరాలను తీర్చే ఈ నది.. ఇసుకాసురుల దాటికి, సరైన ప్రణాళిక లోపంతో ప్రజల దాహార్తిని తీర్చలేని స్థితికి చేరుకుంది. వేసవి వచ్చిందంటే చాలు నది ఎండిపోవడం, **ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడటం పరిపాటిగా మారింది. ప్రభుత్వాలు, అధికారులు కేవలం తాత్కాలిక పరిష్కారాలపై ఆధారపడుతుండటంతో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది.**

- తగరపువలస



సామియ్యవలస వద్ద ఇసుక బస్తాలను నీటికి అడ్డంగా పెట్టిన జీవీఎంసీ సిబ్బంది



గతంలో నదిలో పైపులైన్లు కొట్టుకుపోయిన చోట చెక్‌డ్యామ్ నిర్మించవలసిన అవసరం ఉంది

గోస్తనీ నది విశాఖ, విజయనగరం జిల్లాల్లోని సుమారు 5 నుంచి 6 లక్షల మంది ప్రజల రోజువారీ తాగునీటి అవసరాలను తీరుస్తోంది. ఆనందపురం మండలం బోని వద్ద నుంచి జీవీఎంసీకి, పద్మనాభం మండలం పాండ్రంగి సమీపంలోని సామియ్యవలస వద్ద నిర్మించిన ఊట బావులు, పంప్‌హౌస్‌ల ద్వారా భీమిలి జోన్‌కు నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా విభాగం నదీ తీరంలో బోర్లు వేసి.. ఆ నీటిని రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు తరలించి ప్రజలకు అందిస్తోంది.

వేసవి కష్టం.. తాటిపూడిపైనే భారం

ప్రతి ఏటా ఏప్రిల్, మేలో గోస్తనీ నది చాలా చోట్ల ఎండిపోతుంది. దీంతో జీవీఎంసీ సహా అనేక పంచాయతీల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతుంది. ఆ సమయంలో వర్షాలు పడితే కొంత ఉపశమనం లభిస్తుంది. లేదంటే విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్ నుంచి వచ్చే నీరే దిక్కు. ప్రస్తుతం రెండు వారాల కిందట విడుదల చేసిన నీరు నదిలో చేరినా.. అది కేవలం పది రోజులకు మాత్రమే సరిపోతుందని అంచనా వేస్తున్నారు. మరోమారు రిజర్వాయర్ నుంచి నీరు విడుదల కావడం లేదా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం జరిగితేనే తాగునీటి సమస్య నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

తాత్కాలిక కట్టలు.. రూ.లక్షలు వృథా

గోస్తనీ నదిపై చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే నీటిని నిల్వ చేసుకోవచ్చని మేధావులు సూచిస్తున్నా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పాండ్రంగి పంచాయతీ పరిధిలో మునివానిపేట నుంచి తగరపువలస వరకు ఒక్క చెక్ డ్యామ్ కూడా లేదు. గతంలో తాటితూరు వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కొందరు ధ్వంసం చేయడంతో నీరు నిలవడం లేదు. దీంతో భీమిలి జోనల్ అధికారులు ఏటా సామియ్యవలస వద్ద ఇసుక బస్తాలు, మట్టి కట్టల పేరుతో రూ.లక్షలు నదిలో కుమ్మరిస్తున్నారు. ఏప్రిల్‌లో ఏర్పాటు చేసే ఈ తాత్కాలిక కట్టలు.. జూన్‌లో వచ్చే వర్షాలకు కొట్టుకుపోతున్నాయి.

శాశ్వత పరిష్కారమే శరణ్యం


సామియ్యవలస, తాటితూరు, టి.నగరపాలెం వద్ద శాశ్వత చెక్‌డ్యామ్‌లు నిర్మించి, తగరపువలస వద్ద నది గట్టు ఎత్తు పెంచితే.. వర్షాకాలంలో వచ్చే నీటిని సముద్రంలో కలవకుండా నిల్వ చేసుకోవచ్చు. దీనివల్ల వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించవచ్చని.. ఇసుక బస్తాలు, మట్టి కట్టల కోసం ఏటా చేస్తున్న వృథా ఖర్చును తగ్గించవచ్చని రెండు జిల్లాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలతోనే ఈ పరిస్థితి

గత టీడీపీ ప్రభుత్వ(2014–2019) హయాంలో గోస్తనీ నదిలో విచ్చలవిడిగా జరిగిన ఇసుక తవ్వకాలు నది సహజ స్వరూపాన్ని దెబ్బతీశాయి. పద్మనాభం మండలం పాట్నూరు నుంచి తగరపువలస వరకు ఇసుకాసురులు నది గర్భాన్ని తోడేశారు. కోట్ల విలువైన ఇసుకను తరలించడంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా నేడు నదీ పరీవాహక ప్రాంతం ముళ్ల చెట్లు, గోతులతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. నీటి జాడ కనిపించడమే గగనమైపోయింది.

బోరు నీళ్లే దిక్కు?

భీమిలి మున్సిపాలిటీ గతంలో ఏటా మార్చి నుంచి జూన్ వరకు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొనేది. 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 'నగరబాట' కార్యక్రమంలో ఇక్కడ ప్రజల కష్టాలు చూసి.. రూ.12 కోట్లతో తాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. సామియ్యవలస వద్ద పంప్‌హౌస్, ఆరు ఊటబావులు నిర్మించి నిరంతర నీటి సరఫరాకు మార్గం వేశారు. అయితే పాండ్రంగి, మజ్జివలస, తాటితూరు, టి.నగరపాలెం, తగరపువలస ప్రాంతాల్లో ఇసుక తవ్వకాల ప్రభావంతో సామియ్యవలస వద్ద కూడా ఏప్రిల్, మేలో నీటి లభ్యత తగ్గిపోతోంది. ప్రస్తుతం రెండు ఊటబావులు పనిచేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా రెండు బోర్లు తవ్వి నీటిని భీమిలి జోన్ ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అయితే ఈ బోర్ల నీరు తాగడానికి అనుకూలంగా లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు భీమిలిలోని కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు నదిని ఆనుకుని బోర్ల ద్వారా రోజూ వందలాది ట్యాంకర్లతో నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ అక్రమ నీటి రవాణా పలువురికి కాసులు కురిపిస్తోంది.



ఊటబావులు ఎండిపోయిన చోట తవ్వించిన బోరు

క్లుప్తంగా

సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలి



డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఉద్యోగుల సిక్ లీవ్స్‌కు పూర్తి జీతం చెల్లించాలని ఎస్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 65వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేసి, డిపో మార్చిన కండెక్టర్, డ్రైవర్లను యథావిధిగా ఇక్కడి డిపోలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎ.ఎస్.రావు, వి.ఆర్.ఎస్.ఎస్.రావు, కె.వి.లక్ష్మీ, సీహెచ్.సత్యవతి, బి.ఎ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



విద్యార్థుల తల్లులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: రామలింగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాతృ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థుల తల్లులను సత్కరించారు. విద్యార్థులకు రూ.1000 చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.ఎస్.ఆర్.బాబ్జి, బి.హెచ్.రామచంద్రరావు, గుప్తా, పద్మరాజు, అనీల్ చిత్తరంజన్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న అప్పలనాయుడు

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మునగపాక బైపాస్ రోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో తలపెట్టిన ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వాములవుతున్నారు. మునగపాకకు చెందిన దొడ్డి జగ్గప్పారావు కుమారుడు అప్పలనాయుడు ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.10లక్షలు ఆదివారం విరాళంగా ప్రకటించి అడ్వాన్స్ కింద రూ.5లక్షల చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కాకి రమేష్, రాజేశ్వరి దంపతులు రూ.10,011, వెలగా అప్పలనాయుడు, సత్యవతి దంపతులు రూ.10 వేలు, దాడి చంద్రరావు, మల్లీశ్వరి దంపతులు రూ.12,078 చొప్పున విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటకోట వెంకటరావు, మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఉమేష్, జల్లేపల్లి కిష్టప్ప, విల్లూరి నూక నరసింగరావు, టెక్కలి గంగునాయుడు, విల్లూరి మోహన్, బొడ్డేడ రామునాయుడు, చంద్రపాటి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	:రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:అర్జున్ సన్ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2	:థండర్ బోల్ట్స్
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	:ఓదెల 2
వెంకటేశ్వర	: జింఖానా
శ్రీసత్య	:సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుదురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-6 యూనిట్లు, ఓ పాజిటివ్-28 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 233 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చు.

సమస్యలతో సావాసం.!



కశింకోటలోని వడ్డి వీధిలోని జగనన్న కాలనీలో వర్షానికి బురదమయమైన రోడ్డు



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన రోడ్డు



గత వైఎస్సార్ ప్రభుత్వంలోనే కల్పించిన విద్యుత్ సదుపాయం



కశింకోట: గత ప్రభుత్వం పేదలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీలపై ప్రస్తుతం కూటమి సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అలసత్వం వహిస్తోంది. కనీసం సిమెంట్ రోడ్లు, కాలువలు లేకపోవడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పైగా గత కొద్ది రోజులుగా అకాల వర్షాలతో కాలనీల్లో నీరు చేరి మరింత ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా తాత్సారం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం కశింకోట మండలంలో 2,200 పైగా ఇళ్లు మంజూరు చేశారు. దాదాపు ప్రతి గ్రామంలో వైఎస్సార్ జగనన్న కాలనీలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. కశింకోటలోని వడ్డి వీధిలో మెగా వైఎస్సార్ జగనన్న కాలనీతో పాటు ఐదు కాలనీలను మంజూరు చేశారు. దాదాపు 60 శాతం మేర ఇళ్లు నిర్మించుకొని మూడేళ్ల నుంచి కాలనీల్లో నివాసం ఉంటున్నారు. లైన్లు ఏర్పాటు చేసి ఇళ్లకు విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. కొంత మందికి ఉచితంగా కనెక్షన్ ఇచ్చారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు కూడా చాలా కాలనీల్లో ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉన్నా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టలేదు. అప్పట్లో కాలనీల్లో ఇళ్ల నిర్మాణ దశలో ఉండడం వల్ల మెటీరియల్ తరలించినప్పుడు రోడ్లు, కాలువలు దెబ్బతినే అవకాశం ఉన్నందున వాటి నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం మట్టి రోడ్లు కావడం వల్ల కాలనీలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఇక వర్షం పడితే కాలనీల్లో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దాదాపు అన్ని కాలనీల్లో ఇదే పరిస్థితి ఉంది. పలు చోట్ల కాలనీల్లో రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో విషసర్పాలు, పురుగుల సంచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. జగనన్న కాలనీకి కశింకోటలో పెద్ద బజారు ప్రాంతం నుంచి వచ్చే ప్రధాన రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా జగనన్న కాలనీల వైపు కన్నెత్తి చూడటం లేదని, ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యల పరిష్కారం గురించి పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు మంజూరు చేసినప్పటికి నీటిని మాత్రం సరఫరా చేయడం లేదు. దీంతో ఏడాదిగా అవి నిరుపయోగంగా ఉన్నాయి. దూరంగా వెళ్లి కుళాయి నీటిని తెచ్చుకోవలసిన వస్తోందని, లేదంటే కొనుగోలు చేసుకుని తాగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, కాలువల నిర్మాణానికి, మంచినీటి కుళాయిల నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఏడాదిగా నిరుపయోగంగా ఉన్న కుళాయి



రాళ్లు తేలి ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు

రోడ్లు, కాలువలు నిర్మించాలి



జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుని మూడేళ్లుగా నివాసం ఉంటున్నాం. సిమెంట్ రోడ్లు లేవు. కాలువలు లేవు. దీంతో రోడ్లపైనే మురుగునీరు పారుతోంది. బురదమయంగా మారిన రోడ్ల రాకపోకలు సాగించడానికి ఇబ్బందవుతోంది. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా రోడ్లు, కాలువల నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదు.

– గార పైడిరాజు, వైఎస్సార్ జగనన్న కాలనీ, వడ్డి వీధి, కశింకోట

కుళాయిలు సరే.. నీళ్లేవి?



ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. నీటిని మాత్రం సరఫరా చేయడం లేదు. దీంతో దూరంగా వెళ్లి మంచినీరు తెచ్చుకోవలసి వస్తోంది. కాలనీలో రోడ్లు రాళ్లు తేలి దర్శనమిస్తున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నాళ్లకు సమస్య తీరుతుందో తెలియడం లేదు.

– కర్రి పైడితల్లమ్మ, వైఎస్సార్ జగనన్న కాలనీ, వడ్డి వీధి, కశింకోట

సౌకర్యాల బాధ్యత పంచాయతీలదే..

జగనన్న కాలనీల్లో రోడ్లు, కాలువల నిర్మాణం బాధ్యత పంచాయతీలదే. ఇతర నిధులు సమకూర్చి నిర్మించాల్సి ఉంటుంది. తమ శాఖ నిర్మించదు.

– వి.శ్రీనివాసరావు, ఏఈ, హౌసింగ్, కశింకోట

ఈదురుగాలులతో వర్షం



కశింకోటలోని పూసర్ల వీధి రోడ్డుపై చేరిన వర్షపునీరు

కశింకోట: కశింకోట ప్రాంతంలో ఈదురుగాలులతో వరుసగా మూడో రోజు కూడా వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి ప్రజలు ఇబ్బంది చెందారు. రోడ్లు బురదమయమయ్యాయి. సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తర్వాత విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన కన్నుల పండుగగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై కొలువుదీర్చారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామావళి పూజ భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ ఆర్జిత సేవలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అంతేకాకుండా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది.

10న సత్సంగం, సామూహిక హారతి

పరవాడ: దేవాలయం కేంద్రంగా సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భజనలు, సత్సంగాలు, సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లిమడుగుల నాగేశ్వరరాజు పిలుపునిచ్చారు. ఈ నెల 10న ధార్మిక జట్టు, దేవాలయ కమిటీ సభ్యుల సహకారంతో సత్సంగం కార్యక్రమం నిర్వహించాలని ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు సూచించారు. అలాగే ఈ నెల 12న ప్రతి గ్రామంలో సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన కోరారు.

కూటమిపై ప్రజాగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

- 11 నెలల్లోనే తీవ్ర అసంతృప్తి
- 20 అడుగుల గోడ కట్టలేని వ్యక్తి అంతర్జాతీయ రాజధాని కడతాడట
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్
- సబ్బవరం పార్టీ కార్యాలయం ప్రారంభం

సబ్బవరం: 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. సబ్బవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుతో కలిసి ఆయన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వేలాది మంది అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. 'మన ప్రభుత్వం అధికారంలో ఉన్న నాలుగున్నరేళ్లలో ప్రతిపక్షాలకు సమావేశాలు నిర్వహించడానికి కూడా అవకాశం లేకుండా జగన్ మోహన్ రెడ్డి పాలన సాగించారు. ప్రజల పక్షాన పోరాడేందుకు ఏ ఒక్క సమస్య కూడా లేకుండా చేశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని అమర్‌నాథ్ ఆరోపించారు. సింహాచలం చందనోత్సవంలో జరిగిన అపశ్రుతిని ప్రస్తావిస్తూ, 20 అడుగుల గోడ కట్టలేని చంద్రబాబు అంతర్జాతీయ రాజధాని కడతానంటే భయమేస్తోంది. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?' అని ఆయన ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకుల వల్ల నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందని, ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజల్లో విశ్వాసం నిలిపిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజలకు ముఖం చాటేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. పార్టీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన తక్కువ సమయంలో ఇంత భారీ సంఖ్యలో ప్రజలు తరలిరావడం కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులను భారీ బైక్ ర్యాలీతో పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, పార్టీ అధికార ప్రతినిధి పైలా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శరగడం చినప్పలనాయుడు, పార్టీ సీఈసీ సభ్యులు బైలపూడి భగవాన్ జయరాం, మాజీ జడ్పీటీసీ కోటాన రాము, పి. సురేష్ రాజ్, ఉప్పిలి కనకరాజు, సబ్బవరం ముత్యాలనాయుడు, చొప్పా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బూడి ముత్యాలనాయుడుతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అమర్, అదీప్



వైఎస్సార్‌సీపీ నేతల భారీ బైక్ ర్యాలీ

నేటి నుంచి సీపీఐ జిల్లా సభలు

యలమంచిలి రూరల్: సీపీఐ అనకాపల్లి జిల్లా 2వ మహాసభలు సోమవారం నుంచి యలమంచిలిలో ప్రారంభమవుతాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న మహాసభల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4.30 గంటలకు యలమంచిలి గుర్రప్ప సత్రం నుంచి ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీనగర్, ఎల్ఐసీ కూడలి మీదుగా తిరిగి గుర్రప్ప సత్రానికి ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ర్యాలీ అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరవుతారన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

పెందుర్తి: రెండు నెలల క్రితం అదృశ్యమైన సింహపురి కాలనీకి చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. పోలీసులు అతడిని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేపగుంట సమీపంలోని సింహపురి కాలనీకి చెందిన సదరు వ్యక్తి ఫిబ్రవరి 18న కనిపించకుండా పోవడంతో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ కేవీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, అతడ్ని శనివారం చెన్నైలో గుర్తించారు. అనంతరం ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడని సీఐ సతీష్ కుమార్ తెలిపారు.

మహిళల భద్రతకు అందుబాటులో శక్తి టీం

కశింకోట: మహిళల భద్రత విషయంలో శక్తి టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని టీం ఇన్‌చార్జి, ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ఎస్పీ తుహిన్ సిన్హా మార్గ దర్శకత్వంలో డీఎస్పీ ఎం.శ్రావణి పర్యవేక్షణలో శక్తి టీం ఏర్పాటు చేశారన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై వేగవంతంగా స్పందించేందుకు టీం కట్టుబడి ఉందన్నారు. తమకు సమస్య ఎదురైనప్పుడు శక్తి యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తే సత్వర చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల జరిగిన సంఘటనపై స్పందించిన తీరును వివరించారు. తేగాడ గ్రామానికి చెందిన వ్యక్తి తరచూ వేధిస్తున్నట్టు తాళ్లపాలెం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని శక్తి టీంకు ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో తనతో పాటు హెచ్‌సీ మల్లీశ్వరి, పీసీలు దీపిక, కొండలరావు, అప్పలాచార్య, నాయుడు బృందంగా వెళ్లి సంబంధిత వ్యక్తిని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పాల్పడటం వల్ల తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించామన్నారు. మహిళల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.



ఈవ్ టీజింగ్‌పై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న శక్తి టీం ఇన్‌చార్జి, ఎస్ఐ మనోజ్‌కుమార్

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు



దుర్గాదేవికి జలాభిషేకం చేయడానికి నీళ్ల బిందెలతో తరలివస్తున్న మహిళా భక్తులు

యలమంచిలి రూరల్: మండలంలోని పద్మనాభరాజుపేటలో ఆదివారం దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి పసుపు, వేప కొమ్మలతో శుద్ధిచేసిన నీటిని బిందెలతో తీసుకువచ్చి అభిషేకం చేశారు. పసుపు కుంకుమలు, చీర రవికె, గాజులు, నల్లపూసలు పెట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, నేలవేషాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అనంతరం మధ్యాహ్నం భారీ ఎత్తున భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వల్పంగా తోపులాట చోటు చేసుకుంది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



తాళ్లపాలెం గ్రంథాలయంలో మాట్లాడుతున్న నరసింగబిల్లి హెచ్ఎం సురేష్‌కుమార్

కశింకోట: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో భాగంగా ఆంగ్ల భాష సులభతరంపై ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. రోజుకు కనీసం 5 ఆంగ్ల పదాలను నేర్చుకోగలిగితే ఆంగ్లంపై పట్టు సాధించవచ్చునన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం, విద్యార్థులు పాల్గొన్నారు.